# ఎదురుచూపులు

**సుం**దరమ్మ ఎదురుచూపులు చూస్తూనే వుంది. వీధి గుమ్మం వైపు నించి చూపు మరలటంలేదు. నిద్రతో కళ్ళు మూతలు పడవు... "నన్ను చూడ్డానికి తప్పకుండా వస్తుంది" అప్పుడు నిజం చెప్తా!! సుందరమ్మ కళ్ళలో తిరుగుతున్న కన్నీళ్ళొత్తుకుంటూ ఎదురుచూస్తూనే ఉంటుంది రోజూ. 'నన్ను క్షమించు, అబద్ధమే చెప్పా' అంటాను. క్షమించమనటానికి చిన్న పెద్ద తేడా ఏమిటి – ఎవరు ఎవర్నయినా క్షమార్పణ కోరవచ్చు. ఇలా ఏదో ఏదో అనుకుంటూ గుమ్మంవైపు చూస్తోనే వుంది సుందరమ్మ!!

'వస్తుందంటావా' అంది లక్ష్మితో సుందరమ్మ... సుందరమ్మ భర్త ప్రమాదంలో మరణించాక, పదిహేడేళ్ళ రమని, సుందరమ్మని కనిపెట్టుకు చూస్తోంది,లక్ష్మి, సుందరమ్మకి దూరపు చుట్టం. ఏమే మాట్లాడవేం అంది సుందరమ్మ. అప్పటికి రాత్రి పదిదాటింది. 'ఏంటమ్మా – ఏదో నాలుగు రోజులుండిపోయిన వాళ్ళ గురించి మీకీ దిగులు' అంటూ లక్ష్మి ఇటు నుంచి అటు ఒత్తిగిలి పడుకుంది.

సుందరమ్మ కళ్ళ ముందు గతం కదిలింది. ఆ రోజు రాత్రి పదకొండు గంటలు కొట్టింది గడియారం. నిద్రపట్టని సుందరమ్మ అటూ ఇటూ పక్కమీద కదిలింది. భగవంతుడు తనకు ఎందుకు ఇన్ని శిక్షలు విధిస్తున్నాడు అని అనుకుంటూ, లేచి మంచి నీళ్ళు తాగివచ్చి లైటార్పి పడుకుంది. ఏదో భయం, ఏదో చిరాకు – సుందరమ్మను వేధిస్తున్నాయి.

వీధి గుమ్మంలో ఏదో అలికిడి. దొడ్డివైపు నించి కుక్క అరుస్తోంది. కాలింగ్ బెల్ మోగింది... తలుపు తీయాలావద్దా – ఎవరైనా లోపలకొచ్చి కళ్ళల్లో కారం కొడితే, గొంతునొక్కితే – ఆ, ఈ పనులు పగలూ జరుగుతున్నాయిగా?? – తలుపు చప్పుడు!! సుందరమ్మ తలుపు తెరిచింది.

"ఈ ఇంట్లో చిన్న పోర్షన్ వుందాండి" – సుందరమ్మ వాళ్ళిద్దరివంకా కన్నార్పకుండా చూసింది. జీన్సు పాంటు, టైట్ షర్టు, పొట్టి జుట్టు, ఆ అమ్మాయి! జీన్స్‌పాంటు, గళ్ళ షర్టు, నూనూగు మీసాలు – అబ్బాయి!

చిన్న జంట – ముచ్చటగా వున్నారు. అనుకుంటూ, 'ఇంతరాత్రెందుకూ పొద్దున్న రావచ్చుగా' అంది వాళ్ళవంక చూస్తూ...

వాళ్ళిద్దరూ తనింట్లో అద్దెకుండటానికొచ్చారు అని సుందరమ్మ చాలా సంతోషపడింది. వెంటనే పక్క వాటా తలుపు తీసింది.' రేపు మాట్లాడుకుందాం' అంటూ మంచినీళ్ళ జగ్ వాళ్ళకిచ్చింది.

సుందరమ్మ అలా చూస్తుంటే, ఆ అబ్బాయి చేతిలో ఓ చిన్న సంచి, ఆ అమ్మాయి చేతిలో ఓ చిన్న బాగ్ -!! ఇదేనా వీళ్ళు సామాన్లు అనిపించింది. 'ఆ, రేపు తెచ్చుకుంటార్లే అన్నీ' అని సుందరమ్మ తన మనసుని సమాధాన పరచుకుంది. ఈ పట్నంలో చిన్న ఇల్లు అద్దెకి దొరకడం కష్టమేమరి - వీళ్ళు నా అదృష్టం కొద్దీ నా ఇంటికి వచ్చారు. ఆ అమ్మాయిని చూస్తుంటే అచ్చం రమే అనిపిస్తోంది... ఎన్నాళ్ళయినా హాయిగా వుండమంటా' - సుందరమ్మ తనలో తనే అనుకుంటూ... లైటార్పి పడుకుంది.

'పాపం, ఎంతో మంచిదానిలా వుంది కదా - మా అమ్మే గుర్తొస్తోంది' అంది లత, సురేష్ కౌగిలిలో ఒదిగిపోతూ... సురేష్ ఆ కౌగిలిలో లతని ఉక్కిరిబిక్కిరి చేస్తూ 'ఇది మీ అమ్మ గురించి, మా అమ్మ గురించీ మాట్లాడే సమయమా' అంటూ లైటు ఆర్పేశాడు... రేపటి సంగతి రేపే ఆలోచిద్దాం అన్నట్లుగా ఆ ఇద్దరూ హాయిగా నిద్రపోయారు.

తెల్లారే సరికి లేచింది సుందరమ్మ కాఫీ కాచింది... గది గుమ్మంలోకెళ్ళి నిల్చుంది... తలుపులు వేసే వున్నాయి. సుందరమ్మ స్నానం చేసి, పూజ పూర్తి చేసింది.

"లక్ష్మీ - ఈ రెండు కప్పుల కాఫీ ఆ గదిలో ఇయ్యి' అంది. లక్ష్మికి అర్థం కాలేదు... అయినా రెండు కప్పుల కాఫీ పట్టుకెళ్ళి, వాళ్ళకిచ్చింది.

'ఎవరమ్మా' అంది లక్ష్మి.

'ఎవరేమిటి - భార్యాభర్తా - చిన్న పోర్షన్ కావాలని వెతుకుతుంటే, ఆ పాన్ దుకాణం వాడు చెప్పాడులా వుంది... రాత్రి వచ్చి చేరారు. నువ్వు గుర్రుపెట్టి నిద్రపోతున్నావు, లేపుదామంటే' అంది సుందరమ్మ.

లక్ష్మికి చాలా కోపమొచ్చింది.

'వాళ్ళెవరో ఏంటో తెలుసుకోకుండా - అయినా ఆ చిన్న పోర్షన్ నుంచి వచ్చే అద్దె అంత అవసరమా మనకి - మీకు కోపం వద్దు' అంది సుందరమ్మని సముదాయిస్తూ

"లక్ష్మి, నాకు అద్దె కాదు కావలసింది. మనుషులు. ఆ పిల్లని చూస్తుంటే అచ్చం మా రమలాగే అనిపించింది...

"చూడముచ్చటగా వుంది జంట' అంది పేపరు తిరగేస్తూ సుందరమ్మ.

"ఏమోనమ్మ - నాకేం బాగాలేదు ఈ పద్ధతి. అయినా రాత్రికి రాత్రే ఇంట్లో దూరిపోవటమేమిటీ - ఆ పిల్ల నడుగుతా నుండండి" అంది లక్ష్మి.

"నోరు తగ్గించు... ఆ పిల్లవింటే బాగుండదు" అంటూ సుందరమ్మ అంటుండగానే లత హాలులోకొచ్చింది.

మాది ఈ ప్రాంతం కాదండీ పిన్నిగారు... మా వారికి ఇక్కడ ఓ కంపెనీలో ఉద్యోగమొచ్చింది... అందుకని' లత ఏదో చెప్తుంటే,

"ఏ ప్రాంతమయితేంగానీ, ఇల్లు వాకిళ్ళు చూసుకున్నాక, భార్యని తెచ్చుకోవాలి. ఇలా రెండు సంచులతో భార్యని వెంట బెట్టుకొచ్చేస్తే ఇబ్బంది పడిపోదూ ఆడపిల్ల" అంది లక్ష్మి.

"మా అమ్మ కూడా ఇదే అందండీ పిన్నిగారూ... కానీ మా వారు లత చెప్పేలోపునే, "అవున్లే నిన్నొదిలి ఒక్క రాత్రి కూడా వుండలేను, తెల్లారగానే నిన్ను చూడకపోతే ఆ రోజంతా నాకు తోచదు అన్నాడు కదూ మీ ఆయన - ఈ రోజుల్లో కుర్రాళ్ళంతే, అంటూ, లోపల పనిలోకెళ్ళింది లక్ష్మి.

'ఈ రోజు ఇక్కడే భోం చేయండి - సామాన్లు అవీ తెచ్చుకున్నాక, మంచి రోజు చూసి వంట మొదలుపెట్టవచ్చు' అంటూ, లక్ష్మీ, వీళ్ళు కూడా, ఇక్కడే భోంచేస్తారు' అని కేక పెట్టింది సుందరమ్మ.

'ఒద్దండీ... హోటల్లో చేస్తాం - మీరు' లత సుందరమ్మ వైపు చూస్తూ అంటుంటే గదిలోంచి రా అని సైగ చేస్తున్నాడు సురేష్.

'ఇంటి కొచ్చిన అమ్మాయిని, భర్తని హోటల్లో ఇవాళే భోజనం చేయమంటానా - రేపు మీ అమ్మగారొస్తే. -

సుందరమ్మ మాటకి ఉలిక్కిపడింది లత. 'మా అమ్మగారా - రేపు' అంటే - అదే, రేపు కాకపోతే ఓ నెల రోజుల తర్వాత అమ్మాయి కాపురం చూడ్డానికి మీ అమ్మగారు రారా... అప్పుడు మీ అమ్మగారు ఏమమ్మా, సుందరమ్మ - ఇంటికొచ్చిన అమ్మాయికి ఒకపూట భోజనం పెట్టవా - నువ్వేమి ఇల్లాలివీ, నువ్వేమి తల్లివీ' అని అంటే ఏం చెస్తానో చెప్పు - అమ్మయ్, లతా, ఇవాళే కాదు, మీరన్నీ సర్దుకునే వరకు మా ఇంట్లోనే భోజనం" - సుందరమ్మ అలా మాట్లాడుతుంటే, అమ్మలందరూ ఒకలాగే మాట్లాడుతారా అనిపించి కళ్ళలో నీళ్ళు తిరిగాయి లతకి.

లత అటు ఇటు చూసింది.

'మీ అబ్బాయి, అమ్మాయి...' అంటూ సుందరమ్మ ముఖంలోకి చూసింది లత.

'మా అబ్బాయి, కోడలు, పిల్లలు బెంగుళూరులో వుంటారు' అంది గోడకున్న అబ్బాయి, కోడలు ఫోటో చూస్తూ.

'మీ అమ్మాయి...' లత ఎంతో ఆసక్తిగా అడుగుతుంటే, సుందరమ్మకి పొలమారి దగ్గొచ్చింది. లత గబుక్కున లోపలికెళ్ళి మంచినీళ్ళు తెచ్చి అందించింది. గబగబా నీళ్ళు తాగింది.

'మా అమ్మాయి అమెరికాలో వుంటుంది'

'ఏం చదువేంటీ'

కంప్యూటర్ ఇంజనీరు.

మా అల్లుడు డాక్టరు

'పిన్నిగారూ - మీదే అదృష్టమంటే - మీరు అమెరికా వెళ్ళారా?'

'నన్ను రమ్మని అమ్మాయి, అల్లుడు ఎన్నిసార్లో చెప్పారు - కానీ ఓ పిల్లనో, పిల్లాడినో కనండి - బేబీ సిట్టింగ్ కోసం వస్తా అన్నాను - సుందరమ్మ పకపకా నవ్వింది... లత చిరునవ్వు నవ్వి, పిల్లలిప్పుడే వద్దంటారు, అంతేనా' అంది.

'లతా - నేను ఆరోగ్యంగా వున్నాను... నువ్వు ఏడాది తిరక్కుండా ఓ పిల్లని కంటే, హాయిగా బేబీ సిట్టింగ్ చేస్తా' అంది సుందరమ్మ. అంత భాగ్యముందా అని మనసులో అనుకుంటూ, వస్తా మళ్ళీ అంటూ లత వెళ్ళింది. వంటింట్లో లక్ష్మి ఏమి వంట చేస్తోందా చూడ్డానికి సుందరమ్మ లోపలికెళ్ళింది.

ఓ పక్కన భయంతో చస్తుంటే కబుర్లేమిటీ, విందు లేమిటీ' అన్నాడు సురేష్ లత ఒళ్ళో తలపెట్టుకుని.

"మెల్లిగా మాట్లాడు - వాళ్ళమ్మాయి అమెరికాలో వుందిట. నన్ను చూస్తే ఆ పిల్ల గుర్తొస్తోంది ఆవిడకి - పాపం, మంచావిడ' అంది లత. 'లోకంలో మంచివాళ్ళు ఇంకా వున్నారులే' అని, సురేష్ కిటికీ దగ్గర నిలబడ్డాడు. దూరంగా, రోడ్డుకి అటువైపున నిలబడి ఈ కిటికీ వైపే ఎవరో చూస్తున్నారనిపించింది సురేష్‌కి. కిటికీ తలుపులు వేసేసాడు.

'సరే, ఇప్పుడేం చేద్దాం' అన్నాడు సురేష్.

'కొన్ని నెలలు ఇక్కడుందాం - తర్వాత, లత నైటికున్న లేసు. సరిచేసుకుంటూ అంది.

'తర్వాత ఏమిటీ'

'ఏముందీ, నేను ఇటుకలు మోస్తాను. నువ్వు రిక్ష లాగుతావు - నేను..... ఉండు చెప్తా, గుడ్డవుయ్యాలలో పిల్లనేసి ఊపుతాను - నువ్వు ఫ్లాటులో గోడలకి నీళ్ళు కొడతావు - నేను, నువ్వు అంతే, అంతే! - లత గలగలా నవ్వింది. కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

సురేష్ చిరాగ్గా అటు ఇటూ తిరిగి 'ఎవరో చెప్పారట 'ప్రేమించు ప్రేమకై" - నాన్సెన్స్ - ప్రేమంటేనే అందరికి భయం" అసలర్థం కాదెవరికీ, ప్రేమికులను వేటగాళ్ళలా వెంటాడే ఈ మనుష్యులు సురేష్ అవేశంగా మాట్లాడుతుంటే, లత భయపడి పోయింది.

సురేష్ కిటికీ దగ్గరగా వెళ్ళాడు. కానీ తలుపు తీయాలంటే ఏదో భయం - వెళ్ళిపోవాలి ఎక్కడికో సురేష్ ముఖమంతా చెమటలు - ఆ రాత్రి అన్నం తినకుండా ఒకరినొకరు పెనవేసుకుని నిద్రపోయారు లత, సురేష్.

రెండు రోజులు గడిచాయి. సుందరమ్మ పొద్దునే, 'భోజనాలు చేసారో లేదో' అంది లక్ష్మితో. ఆ రాత్రి తొమ్మిది, పది, పన్నెండు మనకీ - నిద్ర పట్టదు కనక - వాళ్ళకేంటి పడుచువాళ్ళు....... మీ కెందుకమ్మా వాళ్ళ గొల, పడుకోండి 'హాయిగా' అంది లక్ష్మి మంచినీళ్ళ చెంబు సుందరమ్మ మంచం పక్కన బల్లమీద పెడుతూ.

సుందరమ్మ తెల్లారగానే లేచింది. స్నానం, పూజ అయిపోయాయి. లత వాళ్ళు ఇంకా నిద్రలేవలేదా అంది లక్ష్మితో 'బయటికి పోయారేమో - వాళ్ళ గోల మనకెందుకూ' విసుక్కుంది, కూరతరుగుతూ లక్ష్మి.

సాయంత్రం అయింది. అలికిడి లేదు. లతని చూడకపోతే మనసు బాగుండటం లేదు సుందరమ్మకి..... ఆ పిల్లని చూస్తుంటే ఎంతో హాయిగా ఉంటుంది మనసు....... సుందరమ్మ ఇక మనసు ఉండబట్టలేకపోయింది..... తలుపు కొట్టి లతని పిలుస్తా ఉండు అంటూ గది తలుపు ఇలా అనగానే తలుపులు బార్లా తెరుచుకున్నాయి! రెండు సంచులు లేవు, ఆ ఇద్దరూ లేరు, సుందరమ్మ నోట మాట రాలేదు. 'లక్ష్మీ' అని పెద్ద కేక పెట్టింది. 'చెప్పకుండా పోయారా' అంది లక్ష్మి కిటికీ తలుపు తెరుస్తూ. సుందరమ్మకి కళ్ళు తిరిగుతున్నట్లనిపించింది. కుర్చీలో కూలబడింది ఆ గదిలో..... కుర్చీలో ఓ కాగితం, లక్ష్మి చూసింది.

"అమ్మా, మీకు నేను అబద్ధం చెప్పాను..... మేము దంపతులం కాము - నాలుగు రోజులు మీరు చూపించిన ఆప్యాయత మరిచిపోలేను. బతికుంటే ఒక్కసారి మిమ్మల్నొచ్చి చూస్తా - క్షమించండి. లత".

సుందరమ్మ చేతిలో కాగితం అటు ఇటు కదిలింది. కళ్ళల్లో నీళ్ళు కదులుతుంటే అక్షరాలు మసగమసగ్గా వున్నా, అలానే కూడబలుక్కుని అలానే చదువుకుంది మళ్ళా మళ్ళా సుందరమ్మ, లత రాసిన ఆ చిన్న కాగితం సుందరమ్మ చేతిలో కదులుతోంది.

అబద్ధం చెప్పాను, క్షమించండి అంది లత"

అబద్ధం - సుందరమ్మ గుండె ముక్కలవుతున్నట్లనిపించింది.

తన కూతురు రమ అమెరికాలో వుందా!

అల్లుడు డాక్టరా!

తనని రమ్మంటున్నారా!

బేబీ సిట్టింగ్ కోసమయితే వెడుతుందా! -

సుందరమ్మ కన్నీళ్ళాగలేదు.

"లతా నేను అబద్ధమే చెప్పాను. నీవు కనిపిస్తే నిజం చెప్తాను. క్షమించమంటాను. నీకోసం ఎదురు చూపులు చూస్తూనే వుంటాను.

రమ ఇప్పుడు లత వున్నంత వయసులోనే, ప్రేమలోపడి ఇల్లొదిలి వెళ్ళిపోయింది. పూర్తిగా మోసపోయింది. ఎక్కడో చెప్పరాని చోట చెప్పరాని బతుకు బతుకుతోందని ఎవరో చెప్తే, ఆనాడే నాగుండె ఎందుకు ఆగిపోలేదో తెలుసా, లతా నిన్ను చూడ్డంకోసమే అయి వుంటుంది. - ఆ నిజం చెప్పటానికి నోరు రాక అబద్ధాలు చెప్పా - అబద్ధాలలో బతుకుతున్నా..... సుందరమ్మ లతతో మాట్లాడుతున్న భ్రాంతిలోకి వెళ్ళిపోయింది.

ఆ మధ్య పేపర్లో వ్యభిచార గృహంలో పట్టుబడ్డ అమ్మాయిల ముసుగు ఫోటోలు వేస్తే, వాటిల్లో ఆ ముసుగులో నా రమ ఎక్కడైన వుందా అని గుండె పట్లు కదులుతోంటే ఎన్నిసార్లు చూసానో

అయినా నా పిచ్చికానీ, ఇంకేం వస్తుందీ!

ఈ సమాజం రానిస్తుందా మళ్ళా!!

ఆ పిల్ల రాగలదా!! -

సుందరమ్మ తనలో తనే మాట్లాడుకుంటోంది.

నేనూ అబద్ధమే చెప్పా, ఇప్పుడు నీకు నిజం చెప్తా....... నువ్వోస్తావు...... ఒక్కసారిరా...... అబద్ధంతో గుండె బరువు మోయలేకపోతున్నా' - సుందరమ్మ అలా కుర్చీలో కూర్చునే ఉంది.

లక్ష్మి మంచినీళ్ళు గ్లాసు అందించింది సుందరమ్మకి. మంచినీళ్ళు తాగి వీధి గుమ్మం వైపు ఎదురు చూపులు చూస్తూనే వుంది సుందరమ్మ.

- నేటి నిజం దినపత్రిక - దీపావళి - ప్రత్యేక సంచిక 2005